క్లుప్తంగా...

దరఖాస్తుల ఆహ్వానం

సుల్తాన్‌బజార్: నాయీబ్రాహ్మణ ప్రతిభ పురస్కారాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నాయీబ్రాహ్మణ జన సంస్థ గౌరవాధ్యక్షుడు పి.వినోద్‌కుమార్, అధ్యక్షుడు శ్రీధర్, ఉపాధ్యక్షుడు డాక్టర్ సుశీల్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. భరతనాట్యం, వైద్య రంగం, వృత్తుల్లో సామాజిక సేవ, కళారంగం, పత్రికా రంగం, విద్యారంగం, క్రీడారంగం పలు రంగాల్లో రాణిస్తున్న నాయీ బ్రాహ్మణులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఆసక్తి గల వారు 97031 68480లో సంప్రదించాలని కోరారు.

ఎస్సైపై చర్యలు తీసుకోవాలి

చాంద్రాయణగుట్ట: బోనాల ఊరేగింపులో తన కుమారుడిపై అకారణంగా దాడి చేసి గాయపరిచిన ఎస్సైపై చర్యలు తీసుకోవాలని లాల్ దర్వాజా సింహవాహిని మహంకాళి ఆలయ కమిటీ కన్వీనర్ గౌని అరవింద్ కుమార్‌గౌడ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన హోం మంత్రిని కలిసి ఫిర్యాదు చేశారు. బోనాల ఊరేగింపులో తన కుమారుడు హర్షవర్ధన్‌ను ట్రాఫిక్ ఎస్సై ఇష్టానుసారంగా కొట్టాడని వెల్లడించారు. ఈ విషయమై విచారణ చేయించి న్యాయం జరిగేలా చూస్తానని హోం మంత్రి హామీ ఇచ్చారన్నారు. ఆయనను కలిసిన వారిలో మాజీ చైర్మన్ వెంకటేష్, బీఆర్ఎస్ నాయకుడు రాధాకృష్ణ తదితరులున్నారు.

'తెలంగాణలో బీఆర్ఎస్ పతనం ఖాయం'

గోల్కొండ: తెలంగాణలో బీఆర్ఎస్ పతనం ఖాయమని సీనియర్ బీజేపీ నాయకుడు దేవర శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనమంతా ఐక్యంగా ఉండి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలపాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. బీజేపీ తెలంగాణ కొత్త సారథి జి.కిషన్‌రెడ్డి సత్తా గల నాయకుడని, ఆయన సారథ్యంలో అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన అన్నారు.

ప్రజల సహకారంతో బోనాలు విజయవంతం



గోల్కొండ: స్థానికుల సహకారంతోనే గోల్కొండ కోట బోనాలు విజయవంతమయ్యాయని గోల్కొండ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ఆయన గోల్కొండ మహంకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి సురేష్‌చారి ఆయనకు శాలువా కప్పి సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అమ్మవారి వృత్తి పని సంఘం అధ్యక్షుడు సాయిబాబాచారి, సంఘం సభ్యులు తదితరులున్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

నాంపల్లి: గుండెపోటుతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన నాంపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కన్నా లాడ్జిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పాతబస్తీకి చెందిన అబ్దుల్ అలీ కుమారుడు అబ్దుల్ హనీఫ్(40) మెకానిక్. గురువారం రెడ్‌హిల్స్‌లోని కన్నా లాడ్జికి ఓ మహిళతో అతడు వచ్చారు. శుక్రవారం గదులను శుభ్రం చేసే లాడ్జి సిబ్బంది తలుపు కొడితే ఎంత సేపటికి తెరువకపోవడంతో అనుమానం వచ్చి తలుపులు పగులగొట్టి చూశారు. మంచం మీద విగత జీవిగా పడి ఉండటాన్ని సిబ్బంది గుర్తించారు. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని లాడ్జి గదిలోని పరిసరాలను పరిశీలించారు. మృతదేహం మీద ఎలాంటి గాయాలు లేవు. గుండెపోటు వచ్చి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నిషేధిత విదేశీ సిగరెట్లను విక్రయిస్తున్న ముగ్గురి రిమాండ్

సంతోష్‌నగర్: నిషేధిత విదేశీ సిగరెట్లను విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను కంచన్‌బాగ్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. రియాసత్‌నగర్‌కు చెందిన సయ్యద్ అజీముద్దీన్ (45) న్యూ రక్షాపురం కాలనీకి చెందిన మహమ్మద్ అజ్హర్ అలీ (28) వద్ద నిషేధిత విదేశీ సిగరెట్లను కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. మహమ్మద్ అజ్హర్ అలీ గోషామహల్ చాక్నావాడి ప్రాంతానికి చెందిన రాజురాం కుమావత్ (29) వద్ద కొనుగోలు చేసి రక్షాపురం వద్ద విక్రయిస్తుంటాడు. రాజురాం కుమావత్ ఢిల్లీలోని ఉమర్ అలీ వద్ద విదేశీ సిగరెట్లను కొనుగోలు చేసి ఆసిఫ్‌నగర్ జిర్రా ప్రాంతంలోని గోడౌన్‌లో నిలువ చేస్తుంటాడు. కాగా వీరు ముగ్గురు కలిసి విదేశీ సిగరెట్లను విక్రయిస్తున్నారనే విశ్వసనీయ సమాచారంతో సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు కంచన్‌బాగ్ పోలీసులతో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సయ్యద్ అజీముద్దీన్, మహమ్మద్ అలీ, రాజురాం కుమావత్‌లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.4,50,000 విలువ కలిగిన విదేశీ సిగరెట్లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

ముర్గీచౌక్ పునర్‌నిర్మాణ పనులు షురూ..

- ఏడాది పాటు కాలయాపన చేసిన 'కుడా'
- నిధుల మంజూరై శంకుస్థాపన జరిగిన ఏడాదికి కూల్చివేతల పనులు
- రూ.36 కోట్లతో కొత్తగా నిర్మించనున్న జీ ప్లస్ వన్ భవన సముదాయం



ఎట్టకేలకు పూర్తవుతున్న పాత భవనం కూల్చివేతలు

చార్మినార్: ఎట్టకేలకు నిజాం కాలం నాటి ముర్గీ చౌక్ పునర్‌నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఆధునాతన సౌకర్యాలతో పునర్‌నిర్మించడానికి నిధులు మంజూరై మంత్రి కేటీఆర్ గతేడాది ఏప్రిల్ 19న శంకుస్థాపన చేసినప్పటికీ.. ఏడాది కాలంగా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. సరిగ్గా ఏడాది తర్వాత పాత భవనం కూల్చి వేత పనులు చకాచకా కొనసాగుతున్నాయి. పునర్‌నిర్మాణం పనుల బాధ్యతలను తీసుకున్న కులీ కుతుబ్ షా నగరాభివృద్ధి సంస్థ (కుడా)కు చెందిన ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఆశించిన మేరకు పనులను చక్కదిద్దకపోవడంతో ఏడాది పాటు కాలయాపన జరిగింది. ఇప్పటికే ఇక్కడ కోళ్ల వ్యాపారం కొనసాగిస్తున్న వారిని ఖాళీ చేయించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో సమయం పట్టిందని సంబంధిత అధికారులు కుంటి సాకులు చెబుతున్నారు. ఈ వ్యాపారులకు పక్కనే చౌమహల్లా ప్యాలెస్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో తాత్కాలికంగా వ్యాపారాలు కొనసాగించడానికి ఏర్పాట్లు చేసి కూల్చివేత పనులను ప్రారంభించారు.

1930లో ముర్గీచౌక్ నిర్మాణం..

- చార్మినార్–లాడ్‌బజార్‌కు సమీపంలోని ఖిల్వత్ వద్ద 1930లో నిర్మించిన ఈ ముర్గీచౌక్ భవన సముదాయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఈ భవన సముదాయాన్ని పూర్తిగా నెలమట్టం చేసి గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు మొదటి అంతస్తును నిర్మించడానికి జీహెచ్ఎంసీ ప్రణాళికలు రూపొందించింది.
- నిర్మాణ పనుల కోసం జేఎన్‌టీయూ ఆర్కిటెక్చర్ విభాగం నిపుణుల బృందం ముర్గీచౌక్‌ను సందర్శించి సమగ్ర నివేదికను రూపొందించింది. దీని ప్రకారం జీహెచ్ఎంసీ అత్యంత ఆధునాతనమైన సౌకర్యాలతో ముర్గీచౌక్‌ను పునర్మించడానికి ఏర్పాట్లు చేసింది.

పునర్‌నిర్మాణం కోసం రూ.36 కోట్లు మంజూరు..

- ముర్గీచౌక్ పునర్‌నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.36 కోట్లను మంజూరు చేసింది.
- ముర్గీచౌక్ భవన సముదాయాన్ని 2021లో అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి సందర్శించి సాధ్యమైనంత వెంటనే పనులు ప్రారంభించాలని మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్‌కు ఆదేశాలు జారీ చేశారు.
- అంతేకాకుండా జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ కూడా ముర్గీచౌక్ భవన నిర్మాణం సముదాయాన్ని పుననిర్మించడానికి ఆమోదించింది. దీంతో గత కొన్నేళ్లుగా శిథిలావస్థకు చేరిన ముర్గీచౌక్ పునర్నిర్మాణమై రాబోయే రోజుల్లో ఆకర్షణీయమైన భవనంగా ఏర్పడనుందని పాతబస్తీ ప్రజలు, ఇక్కడి వ్యాపారులు భావిస్తున్నారు.
- కొన్ని సాంకేతిక కారణాలతో భవన సముదాయ నిర్మాణం పనులు ఆలస్యమవుతున్నాయని అధికారులు అంటున్నారు.



శిథిలావస్థలో ముర్గీచౌక్ భవన సముదాయం(ఫైల్)



పునర్‌నిర్మాణ భవన సముదాయం నమూనా

ముర్గీచౌక్‌గా మారిన మహబూబ్ చౌక్..

- నిజాం కాలంలో మోజంజాహి మార్కెట్‌తో పాటు మహబూబ్ చౌక్ నిర్మాణం జరిగింది. - చార్మినార్‌కు కూతవేటు దూరంలో నిర్మింపబడిన మహబూబ్‌చౌక్‌లో మొదట్లో పురాతన వస్తువులతో పాటు పక్షులు, గ్రాసరీ ఐటమ్స్‌లను విక్రయించేవారు.
- రాను రాను కోళ్ల విక్రయాలు మొదలయ్యాయి. ఉర్దూలో కోడిని ముర్గీ అంటారు. దీంతో మహబూబ్ చౌక్ ముర్గీచౌక్‌గా మారింది.
- అప్పటి నుంచి ఇప్పటి వరకు ముర్గీచౌక్‌గా కొనసాగుతున్న మహబూబ్ చౌక్‌ను పునర్‌నిర్మించడానికి కూల్చి వేతలు కొనసాగుతున్నాయి.
- ముర్గీచౌక్‌లో నాలుగు బ్లాక్‌ల్లో జీ ప్లస్ వన్ భవన సముదాయాల్లో 292 షాపులను నిర్మించనున్నారు.

టోలి-చౌకిలో ఎమ్మెల్యే పర్యటన

గోల్కొండ: అధికారుల అలసత్వం కారణంగానే టోలిచౌకి చౌరస్తా వరదనీటిలో నిండిందని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన టోలిచౌకిలో పర్యటించారు. తమ షాపుల్లో 3 అడుగుల మేరా వరదనీరు వచ్చి చేరిందని, రెండు రోజులుగా తమ షాపులు, హోటళ్లు తీయలేని పరిస్థితి ఉందని షాపుల నిర్వాహకులు ఆయన ముందు వాపోయారు. పైపులు వేయడానికి తవ్విన మట్టి బురదగా మారి తమ షాపుల్లో మేట వేసిందని, సహాయక చర్యలు చేపట్టే వారు ఎక్కడా కానరావడం లేదని ఆయనకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన వర్షాలతో నష్టపోయిన వారిని ఆదుకుంటానన్నారు. సకాలంలో పని పూర్తి చేయని అధికారుల కారణంగానే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. తాను ఎన్నో మార్లు పనులు పూర్తి చేయాలని అధికారులను కోరినా కూడా అధికారులు స్పందించడం లేదని ఆయన పేర్కొన్నారు. పనులు పూర్తి చేయని కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని తాను బల్దియా కమిషనర్‌ను కోరతానని ఆయన అన్నారు. వరద నీరు చేరిన రుమాన్ హోటల్, రహమత్ హోటల్, లిమ్రా షాదీఖానాతో పాటు వాటిని ఆనుకుని ఉన్న షాపులను ఆయన పరిశీలించారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, డీఈ రామకృష్ణ, టోలిచౌకి డివిజన్ మజ్లిస్ నాయకులు హారూన్ ఫరాన్ తదితరులున్నారు.



టోలిచౌకిలో పైప్‌లైన్ కోసం తవ్విన గుంతలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

నాలా అభివృద్ధి పనులను వేగవంతం చేయండి



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ

యాకుత్‌పురా: నాలా అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ సూచించారు. నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి జలమయమైన లోతట్టు ప్రాంతాలతో పాటు పెండింగ్‌లో ఉన్న నాలా అభివృద్ధి పనులను ఆయన రెయిన్‌బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసియుద్దీన్, మాన్‌సూన్ ఎమర్జెన్సీ బృందాలతో కలిసి శుక్రవారం పరిశీలించారు. రహమత్ నగర్, ముర్తుజానగర్, మౌలాకా చిల్లా ప్రాంతాల్లో కొనసాగుతున్న నాలా నిర్మాణ పనులను పరిశీలించి అధికారులతో ఆరా తీశారు. లోతట్టు ప్రాంతాల్లో తలెత్తే వరద నీటి సమస్యలపై జీహెచ్ఎంసీ అధికారులు ఎప్పటికప్పుడు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉంటూ అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నాలా అభివృద్ధి పనులు కొనసాగుతున్న ప్రాంతాల్లో సమస్యలు రాకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.


సన్మానం

అబిడ్స్: నగర నూతన కలెక్టర్‌గా పదవీబాధ్యతలు స్వీకరించిన అనుదీప్ దురిశెట్టిని హైదరాబాద్ జిల్లా టీఎన్జీఓస్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కారం చేశారు. జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని, సహ అధ్యక్షుడు కేఆర్.రాజ్‌కుమార్, కార్యదర్శి విక్రమ్‌కుమార్‌తో పాటు పలువురు నాయకులు కలెక్టర్‌కు పూలబొకేను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి పలు అంశాలు తెచ్చారు. కలెక్టర్ ప్రాంగణంలో టీఎన్జీఓస్ భవనం నిర్మాణం, కారుణ్య నియామకాల గురించి కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో కుర్రాడి శ్రీనివాస్, వైదిక్ శాస్త్రి, శంకర్, ముకీమ్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌ను సన్మానిస్తున్న ఎస్ఎం ముజీబ్ హుస్సేని, కేఆర్.రాజ్‌కుమార్ తదితరులు

ఉచిత వైద్య శిబిరం



మందులను అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు శంభు శర్మ విశ్వకర్మ

జియాగూడ: మూసీ పరీవాహక ప్రాంతాల్లోని నిరుపేదలకు వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్త చర్యగా మందులను పంపిణీ చేస్తున్నట్లు ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మల్లేశ్వరి, పన్నిపురా డాక్టర్ సాయిప్రసన్న అన్నారు. ఈ మేరకు శుక్రవారం జియాగూడలోని కేశవస్వామిన గర్ మూసీనది ఒడ్డున పన్నిపురా అర్బన్‌హెల్త్ పోస్టు ద్వారా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 90 గుడిసెవాసుల కుటుంబాలకు ప్రాథమిక చికిత్సలు నిర్వహించగా మందులను బీఆర్ఎస్ నాయకుడు శంభుశర్మ విశ్వకర్మ చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మూసీ పరీవాహక ప్రాంతాల్లో హైరిస్క్ ఉన్నందునా గుర్తించి క్యాంపులను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం.ఎ. అమ్మాజి, ఆర్.అమ్మాజీ, సంధ్య, వరమ్మ, లలిత, పుష్ప, లక్ష్మి ఉన్నారు.

28, 29వ తేదీల్లో జూపార్కులో విద్యార్థులకు పోటీలు

బహదూర్‌పురా: ఈనెల 28, 29వ తేదీల్లో ప్రకృతి పరిరక్షణ దినోత్సవం, అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా నెహ్రూ జూలాజికల్ పార్కులో పాఠశాలల విద్యార్థులకు పలు పోటీలు, అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నామని జూపార్కు క్యూరేటర్ ప్రశాంత్ బాజీరావు పాటిల్ అన్నారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాల నుంచి ప్రతి పోటీకి ఇద్దరు విద్యార్థులను నామినేట్ చేసి మా వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. విజేత పాఠశాలకు జూ టైగర్ ట్రోఫీ–2023 అన్ని పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పాఠశాలలకు ప్రదానం చేస్తామన్నారు. జూలై 28న ప్రకృతి సంరక్షణ–వన్యప్రాణుల ప్రాముఖ్యతపై విద్యార్థులకు క్విజ్ పోటీలు, డ్రాయింగ్ పోటీలు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 040–24477355, 7794933880లో సంప్రదించాలన్నారు.

ముగిసిన సామూహిక కుంకుమార్చన

యాకుత్‌పురా: హరిబౌలి అక్కన్న మాదన్న మహంకాళి ఆలయంలో ఐదు శుక్రవారాల పాటు నిర్వహించిన సామూహిక కుంకుమార్చన ముగిసింది. ఉదయం అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, అర్చన, హారతి చేశారు. స్థానిక ప్రాంతాలకు చెందిన మహిళలు పాల్గొని అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రాందేవ్ అగర్వాల్, దత్తాత్రేయ, సతీష్, రాజారత్నం, భరత్ ప్రకాశ్, ప్రభాకర్, క్రాంతి కుమార్, జగన్‌మోహన్ కపూర్, రమేశ్, రాజు, మహేశ్, ఇషాంత్ సూరి, శేఖర్ యాదవ్, రజత్ పాల్గొన్నారు.

పాఠశాల సీజ్

దూద్‌బౌలి: కోర్టు ఆదేశాలతో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఓ పాఠశాలను శుక్రవారం జీహెచ్ఎంసీ చార్మినార్ సర్కిల్–9 అధికారులు సీజ్ చేశారు. టౌన్ ప్లానింగ్ ఏసీపీ ఇర్షాద్ అహ్మద్ తెలిపిన వివరాల ప్రకారం.. శాలిబండ ఆశా టాకీస్ సమీపంలో తయ్యబా కాన్సెప్ట్ పాఠశాలను కొద్ది రోజులుగా నిర్వాహకులు టౌన్ ప్లానింగ్ అనుమతులు సరిగ్గా లేకుండా నిర్వహిస్తున్నారు. స్థానికులు కోర్టును ఆశ్రయించడంతో కోర్టు ఆదేశాల మేరకు అధికారులు పాఠశాల నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. సెక్షన్ ఆఫీసర్ నరేశ్, మునావర్ అలీ, చైన్‌మెన్ పర్వేజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



చార్మినార్: టీఎస్ బసవ కేంద్రం వ్యవస్థాపన అధ్యక్షుడు నాగ్‌నాథ్ మాశెట్టి కుటుంబ సభ్యులు మీరాలం మండి మహంకాళేశ్వర ఆలయాన్ని శుక్రవారం సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ఘనంగా సత్కరించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

'బీఆర్ఎస్, బీజేపీలకు ప్రజలే గుణపాఠం చెబుతారు'

అబిడ్స్: బీఆర్ఎస్, బీజేపీలకు ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రజలే తగిన గుణపాఠం నేర్పుతారని రాష్ట్ర కాంగ్రెస్ ఫిషర్‌మెన్ విభాగం చైర్మన్ మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని కేసీఆర్ ప్రభుత్వం, కేంద్రంలోని ప్రధాని మోదీ ప్రభుత్వాలు ప్రజలకు శాపంగా మారాయన్నారు. ఆగాపురాలోని తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో గోషామహల్‌తో పాటు తెలంగాణ నలుమూలలా కాంగ్రెస్ విజయ దుందుబి మోగిస్తుందన్నారు. అనంతరం గోషామహల్‌తో పాటు నగరానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మెట్టు సాయికుమార్‌ను జన్మదినం సందర్భంగా ఘనంగా సత్కరించారు.



మెట్టు సాయికుమార్‌ను సత్కరిస్తున్న నేతలు

25 నుంచి శ్రీమద్ భాగవత సప్తాహం



కరపత్రికలను ఆవిష్కరిస్తున్న విశ్వేశ్వరయ్య గుప్తా, లక్ష్మణ్ గుప్తా తదితరులు

గౌలిపురా: అనేక సమస్యలకు ఆధ్యాత్మిక రంగం పరిష్కారం చూపుతుందని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త సరాబు విశ్వేశ్వరయ్య గుప్తా అన్నారు. శుక్రవారం సద్గురు శ్రీ మలయాళ స్వామి సేవా సమాజం భవనంలో ఈనెల 25 నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు నిర్వహించనున్న శ్రీమద్ భాగవత సప్తాహ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రికలను విశ్వేశ్వరయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధిక శ్రావణంలో భారత సప్తాహ కార్యక్రమండం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా మలయాళ స్వామి సేవా సమాజం ట్రస్టు ప్రధాన కార్యదర్శి సరాబు లక్ష్మణ్ గుప్తా మాట్లాడుతూ.. మొదటిసారిగా నిర్వహిస్తున్న శ్రీమద్ సప్తాహాన్ని ఆమనగ్లు ట్రస్టు ఆవరణలో నిర్వహిస్తున్న భాగవత సప్తాహ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మలయాళ స్వామి సేవా సమాజం ట్రస్టు కార్యదర్శి దార్ల యాదయ్య, లక్ష్మణేశ్వర స్వామి ఆలయ మాజీ అధ్యక్షుడు అన్నారావు కులకర్ణి, భజన, సంగీత కళాకారులు ఆదిరెడ్డి పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలు దేశానికే అవమానం



మాట్లాడుతున్న గౌరి సతీష్

అబిడ్స్: మణిపూర్‌లో అనాగరిక ఘటనలు చోటు చేసుకుంటున్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అరికట్టలేకపోవడం దేశ ప్రజలకు అవమానకమని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరి సతీష్ పేర్కొన్నారు. మణిపూర్ సీఎం, కేంద్ర హోం మంత్రి, ప్రధానమంత్రి వైఫల్యంతోనే అక్కడ తరచూ విషాదకర ఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. వెంటనే మణిపూర్‌లో శాంతియుత, ప్రశాంత వాతావరణం కల్పించాలని, లేనిచో తామే రంగంలోకి దిగుతామని సుప్రీంకోర్టు సైతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు మొట్టికాయలు వేయడం సిగ్గుచేటు అన్నారు. భారత్ సెక్యులర్ దేశమని శాంతియుతంగా, ప్రశాంతంగా 140 కోట్ల ప్రజలు జీవించడమే తమ కాంగ్రెస్ పార్టీ ఉద్యేశమని ఆయన అన్నారు.

బాధ్యతల స్వీకరణ

చార్మినార్: గ్రేటర్ నారోనల్ అగర్వాల్ సమితి అధ్యక్షుడిగా ఎంపికైన పంకజ్‌కుమార్ అగర్వాల్ బాధ్యతలు స్వీకరించారు. పాతబస్తీ రికాబ్‌గంజ్‌కు చెందిన పంకజ్‌కుమార్ అగర్వాల్ ఇప్పటికే హైదరాబాద్ అగ్రవాల్ కుంభమేళా, అశోక్ ఫౌండేషన్‌కు అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఇప్పటి వరకు అధ్యక్షుడిగా కొనసాగిన రాజేందర్ అగర్వాల్ నుంచి బాధ్యతలు బాధ్యతలు తీసుకున్నట్లు ఆయన శుక్రవారం వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రస్తుత ప్రధాన కార్యదర్శి రవీందర్ అగర్వాల్, మాజీ కార్యదర్శి అశోక్ తదితరులు పాల్గొన్నారు.



రాజేందర్ అగర్వాల్ నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న పంకజ్‌కుమార్ అగర్వాల్

తెలంగాణ రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా సారంగపాణి



సుల్తాన్‌బజార్: తెలంగాణ రజక సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రజక సంఘం నూతన కార్యవర్గాన్ని రజక సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం హనుమాన్ టేకిడి బీసీ సాధికత భవన్‌లో తెలంగాణ రజక సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు అత్తిలి ఆది నారాయణ అధ్యక్షతన నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సంఘం అధ్యక్షుడు వడ్డేపల్లి సారంగపాణి తెలిపారు. తెలంగాణ రజక సంఘం నూతన కార్యవర్గం రాష్ట్ర అధ్యక్షుడిగా వడ్డేపల్లి సారంగపాణి, ఉపాధ్యక్షుడిగా కుదురుపాక పోషం, ప్రధాన కార్యదర్శిగా చెంచాలపు శ్రీనివాసరావు, యూత్ అధ్యక్షుడిగా కుమ్మరికుంట భిక్షపతి, రజక ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా తంగెళ్ల తిరుపతి, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా వైనాల సంపత్, అధికార ప్రతినిధిగా పావురాల భిక్షపతి, ములుగు జిల్లా అధ్యక్షుడిగా గుమ్మడెల్లి లక్ష్మణ్, ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శిగా వైనాల సదానందం ఎన్నికైనట్లు సారంగపాణి తెలిపారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలను రజకులకు అందేలా కృషి చేస్తానన్నారు.

పేద రోగులకు చేయూతనందించడం అభినందనీయం

అఫ్జల్‌గంజ్: ఉస్మానియా ఆస్పత్రికి వచ్చే పేద రోగులను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకురావడం అభినందనీయమని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్ అన్నారు. ఆస్పత్రిలో హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్, లెప్రా ఇండియా సంస్థల ఆధ్వర్యంలో మధుమేహ రోగుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన చెప్పులను అందించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఎండోక్రైనాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్, చర్మ విభాగం వైద్యులతో కలిసి సంస్థ మధుమేహ రోగుల క్లినిక్‌లో చెప్పులను అందజేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ నాగేందర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. మధుమేహ రోగులకు కాళ్లల్లో తరచూ అల్సర్స్ వ్యాపిస్తుంటాయన్నారు. ప్రత్యేకంగా రూపొందించిన చెప్పులు వేసుకోవడం వల్ల ఉపశమనం కలుగుతుందన్నారు. హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్, లెప్రా ఇండియా ప్రతినిధులు ప్రశాంత్ నాయక్, వైద్యులు నీలవేణి, రాకేష్ సహాయ్, మనీశా సహాయ్, ఎండీ రఫీ పాల్గొన్నారు.



సంస్థల ప్రతినిధులతో డాక్టర్ నాగేందర్, డాక్టర్లు నీలవేణి, రాకేష్ సహాయ్, ఎండీ రఫీ తదితరులు

విక్రమ్‌గౌడ్‌తో ఈటల రాజేందర్ సమావేశం



అబిడ్స్: బీజేపీ నాయకుడు, మాజీ దివంగత మంత్రి ముఖేష్‌గౌడ్ తనయుడు విక్రమ్ గౌడ్‌తో రాష్ట్ర బీజేపీ ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సమావేశమయ్యారు. శుక్రవారం ఎంజేమార్కెట్‌లోని విక్రమ్‌గౌడ్ నివాసానికి ఈటల రాజేందర్ వెళ్లి భోజనం చేసిన అనంతరం కొంతసేపు రాజకీయాలపై చర్చించారు. రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే రాజాసింగ్‌తో సమావేశమైన ఈటల గోషామహల్ నియోజకవర్గంలో తన భేటీలను కొనసాగిస్తున్నారు. అనంతరం విక్రమ్‌గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో తాను పోటీ చేస్తానని తెలిపారు. రాజాసింగ్ మద్దతు కూడా తనకెంతో అవసరమి, ఆయన ఇంటికి వెళ్లి మద్దతు కోరుతానని పేర్కొన్నారు.

పుస్తకావిష్కరణ

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో పాలపిట్ట బుక్స్ ఆధ్వర్యంలో రచయిత జాలాది రత్నసుధీర్ రచించిన 'మనసుపలికిన'అనే పుస్తకావిష్కరణ సభ శుక్రవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాంక్ మాట్లాడుతూ..మనస్సులోని భావాలను అద్భుతమైన పదాలతో వర్ణించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎ.దినకర్‌బాబు, కథా రచయిత సీఎస్.రాంబాబు, రచయిత విహారి, పాలపిట్ట సాహిత్య మాసపత్రిక ఎడిటర్ గుడిపాటి తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య కొలకలూరి ఇనాంక్ తదితరులు